


# బెలూన్

శివం

గోపాల మరాఢే ఎప్పుడో ఒకప్పుడు ఆకస్మికంగా చనిపోతాడని మా అందరికీ తెలుసుగాని, అతనిట్లా ఆఫీసు వున్న రోజున చనిపోతాడని ఎవ్వరూ అనుకోలేదు. సరిగ్గా 3 గంటలకి గోపాల మరాఢే పుత్రుడు రామ మరాఢే 12 ఏళ్ళ కుర్రాడు, ఏడుస్తూ ఆఫీసుకొచ్చి యీ వార్త అందజేసేడు.

ఇటువంటి ఆపద వచ్చినా, మరేరకమైన శుభ కార్యాలొచ్చినా, ఏమాత్రం వెనుకంజ వెయ్యకుండా నడుం కట్టేవాళ్ళు కొందరు ప్రతి ఆఫీసులోనూ ఉంటారు. మా ఆఫీసులో అట్లాంటి పరోపకారి పార్థసారథి. అతను త్వరగా టైపుమిషన్ దగ్గరికి వెళ్ళి చిన్న "అప్పీలు" ఒకటి టైపు చేసుకొచ్చి, అందరి దగ్గరకూ వెళ్ళి ఓ గంటలో 200 రూపాయలు వసూలు చేసుకుని, తను కాలనీకి వెళ్ళిపోతున్నానని చెప్పి, మమ్మల్నందర్నీ ఆఫీసులు అవ్వగానే ఎక్కడకూ పోకుండా తిన్నగా కాలనీకి వచ్చెయ్యమని హెచ్చరించి, రామ మరాఢేతో కాలనీకి వెళ్ళిపోయేడు.

గోపాల మరాఢేని మా ఆఫీసులో ఎరగని వాళ్ళు లేరు. అతనికి భయపడని వాళ్ళు లేరు. గోపాల మరాఢే వయస్సు నలభయి ఏళ్ళు కూడా వుండవు. అతనికి తాగుడు ఎట్లా అలవాటు అయ్యిందో అయ్యింది. మొదట్లో ఆఫీసు అయిపోగానే తాగి ఏ అర్ధరాత్రికో కొంపకు చేరుకునేవాడు. తర్వాత తర్వాత తాగి ఆఫీసుకే వచ్చేసేవాడు. ఎవరు ఎన్ని చెప్పినా నవ్వి వూరుకునేవాడు. ఆ తరువాత తరువాత కావల్ను "నా కష్టాల్లో నువ్వు ఉంటే తాగక ఏం చేస్తావు బ్రదర్! అసమర్థులు తాగవలసిందే, తాగకపోతే అవమానంతో చావాలి. ఇంత సంసారాన్ని వదిలి చచ్చే ధైర్యం లేదు. కనక, తాగి చచ్చిపోతాను." అనేవాడు అతను. ఆఖరికి అట్లాగే ఆ ఆదివారం అంతా తాగి తాగి, సోమవారం ఉదయం అంతా బాధపడి, మధ్యాన్నం 2 గంటలకి చనిపోయేడు.

గోపాల మరాఢే కప్పిస్తే దబ్బు అడుగు తాడేమోనని హడిలిపోయి చాలాసార్లు మొహాలు చాటు వేసుకున్న మేమంతా, ఆరు గంటలకల్లా కాలనీకి వెళ్ళి అతని అంత్యక్రియలు జాగ్రత్తగా జరిగేట్లు చూసేం రాత్రి 8 గంటలకి యిళ్ళకి వెళ్ళి స్నానాలు చేసి, ఆ మర్నాటినుంచీ గోపాల మరాఢే సంగతి మరిచిపోవడానికి ప్రయత్నించ సాగేము.

చాలా మందికి కష్టాలను భరించే సాహసం ఉండదు. ఆ కష్టాలను భరించలేక అనేకమంది అనేక అడ్డుతోవలు తొక్కుతారు. కొందరు మోసాలు చేస్తారు. కొందరు లంచాలకి పాల్పడతారు. కొందరు రకరకాల కళలు అభ్యసిస్తారు. గోపాల మరాఢే ఇవేవీ చెయ్యలేదు; తనని తాను మరచిపోవడానికి త్రాగుడు అభ్యాసం చేసుకున్నాడు. అతనికి లంచాలు తీసుకునే అవకాశంవున్నా ఎన్నడూ లంచం తీసుకోలేదు మోసాలుచేసే అవకాశంవున్నా యెన్నడూ యెవరినీ మోసం చెయ్యలేదు. ఎవ్వరైనా యెదురుపడితే, చిన్న వ్వుతో "బ్రదర్! రెండు రూపాయలుంటే యియ్యి. పొద్దున్నుంచి తాగలేదు. మనస్సు యేం బాగాలేదు.' అనేవాడు.

గోపాల మరాఢే చనిపోయిన వారం వరకు ఆఫీసులోనివాళ్ళు, ఇంట్లోని ఆడవాళ్ల కూడా రకరకాలుగా చెప్పుకున్నారు. కొందరు అన్నారు—"కూతురు మలయాలీ కుర్రాడు యెవరితోటో సంబంధం పెట్టుకుని, కడుపు తెచ్చుకుందట." మరికొందరు అన్నారు,

"భార్యతో పేచీపడి విషం తాగేడుట." "అప్పులబాధ పడలేక చనిపోవాలనే బాగా తాగేసేడుట." "కూతురు యెవరితోటో లేచి వెళ్ళి పోయిందట. ఆ అవమానం భరించలేక యీ పని చేసేడు. ఇప్పుడు కూతురు వచ్చేసింది కడుపుతో."

ఆలోచించినకొద్దీ నాకు గోపాల మరాఢే పైన జాలి యెక్కువ అయ్యింది. అతను బతికి ఉండగా మేమంతా కలసి అతని బాధేమిటో విచారించి, చాతనైన సాయం ఎందుకు చేయలేక పోయేమా అని దిగులుపడ సాగేను. మా కాలనీలో మా మధ్య ఉంటూ, అనాధలాగ ఎందుకు చనిపోవలసి వచ్చిందో, దానికి మేమంతా ఎంతవరకు బాధ్యులమో ఆలోచించిన కొద్దీ మా అందరిపైనా అసహ్యం వెయ్యసాగింది. వీలుంటే అతని కూతురికి ఎక్కడైనా ఉద్యోగం చూపిస్తే బాగుంటుందని, ప్రయత్నించాలనీ అనుకున్నాను.

మరుసటి వారం మా బావమరిది పెళ్ళని మా శ్రీమతి, పిల్లలతోసహా రాజమండ్రి వెళ్ళిపోయింది....నెల రోజులవరకు తిరిగిరానని స్పష్టంగా చెప్పేసి. నాకు సెలవు దొరక్కపోవడంవల్ల నేను స్వయంపాకం చేసుకుంటూ, కొలువు చేసుకోవలసి వచ్చింది.

ఇంతకీ చెప్పవచ్చే దేమిటంటే, యింత అన్నం వండుకుని తినాలని సాయంత్రం పూట రోజూ పెందరాళే ఆఫీసునుంచి తిన్నగా యింటికి రావలసి వచ్చేది. నేను యింటికి వచ్చేసరికి రామ మరాఢే మిగతా పిల్లలతో మా యింటిముందు గోలీలు, గిల్లాదంప ఆటలు ఆడుతూ ఉండేవాడు. వాడిని చూడగానే నా మనస్సు జాలితో కరిగిపోయేది. ఏదో వంకతో వాడికి యేదో ముట్టచెప్పాలని వాడిచేత సిగరెట్లు, సోడాలు తెప్పించి, వాడికి కొనుక్కోడానికి పావలా, పది పైసలు, ఇవ్వసాగేను. ఇట్లా నాలుగైదు రోజులు జరిగేసరికి, వాడు ఉదయమే మా యింటికి వచ్చేసేవాడు. పాలవాడు పాలు తీసుకురాకపోతే వీడే గిన్నె తీసుకెళ్ళి పాలు పోయించుకొని వచ్చేవాడు, 'షాప్'లోకి కిరసనాయిలు ఉందో లేదో చూసి, లేకపోతే తెచ్చేవాడు. బొగ్గులపొయ్యి రాజేసి "వేన్నీళ్లు కాస్తాను—స్నానం చెయ్యండి. చన్నీళ్ళు చేస్తే జబ్బు చేస్తుంది" అనేవాడు. ఇట్లా క్రమక్రమంగా రామ మరాఢే పొద్దున్నా, సాయంత్రం మా ఇంట్లోనే గడిపివేసేవాడు. ఒక్కోసారి నా తోనే భోజనం చేసేవాడు. ఒక్కోసారి కాఫీ మాత్రమే తాగేవాడు. తిన్నా తినకపోయినా, రోజూ పొద్దున్నా, సాయంత్రం వచ్చి, ఏదో సాయంచేసి పోతూండేవాడు. వాడు రావడం ఏమాత్రం ఆలస్యం అయినా కాలుకాలిన పిల్లిలా యిల్లంతా తిరిగేవాడిని.

రామ మరాఢే ఆరవతరగతి ప్యాసయ్యి ఏడవతరగతిలోకి వచ్చేడుట. చక్కగా స్వచ్ఛంగా తెలుగు మాట్లాడతాడు. ప్రస్తుతం చదువూ లేదు. సంధ్యా లేదు. "ఏరా! మరి చదువుకోక ఏం చేస్తావురా!" అంటే, 'చదువుకుని మా నాన్న ఏం చేసేడు?' అంటాడు,

"అది కాదురా! చదువుకుని చక్కగా వుద్యోగం చేసుకోవాలి. మీ అమ్మావాళ్ళనూ ఎవరు పోషిస్తార్రా!" అంటే 'మా అక్క S. S C. ప్యాసయ్యింది. దానికంటె నాకు బాగా వస్తుందా చదువు! దాన్ని చెయ్యమను ఏం వుద్యోగం చేస్తుందో!" అంటాడు.

"అరే! నీకు మంచి బట్టలూ అవీ కుట్టిస్తా. బాగా చదువుకో. ఏం?" అంటే 'నా మొహం! నాకు చదువు ఎందుకు కానీండి! ఎక్కడైనా నెలకి యాభై రూపాయలు యిచ్చే వుద్యోగం యిప్పించండి. చేస్తాను" అన్నాడు వాడో రోజున. "సరే! ప్రయత్నిస్తాలే!" అన్నాను.

ఆ తర్వాత రెండు మూడుసార్లు అడిగేడు వాడు, "ఏమండీ! నా వుద్యోగం సంగతి ఏం చేసేరు?" అని. "చూద్దాంలే, తొందరపడకు" అన్నాను—నవ్వేస్తూ.

ఒకనాడు వాడు ఏడుస్తూ చెప్పేడు, "ఇవ్వేళ యింట్లో ఎవరూ భోంచెయ్యలేదు. నేను వుద్యోగం చేసి డబ్బులు సంపాదించాలి. త్వరగా చూడండి వుద్యోగం."

వెంటనే యింట్లోంచి ఓ అయిదు రూపాయల కాగితం తీసియిచ్చి "వెళ్లు. ముందు యిది యింట్లో యిచ్చేసిరా. ఊ!" అని వాడిని తరిమివేసేను అక్కడినుంచి.

రామమరాఢే వరసగా రెండురోజులు కన్పించలేదు ఆ తర్వాత. ఏమయిపోయేడో అని ఆదుర్దాపడ్డాను ఆ రెండురోజులూ. మూడోరోజు వుదయమే వచ్చి, "స్టోర్సు దగ్గర సామాన్లు మోస్తున్నాను సార్! రోజూ రెండు రూపాయల వరకు దొరుకుతోంది. జీతాలు "టైం" కాదూ? మాంఛి గిరాకీలు తగుల్తోంది" అన్నాడు.

"ఇంట్లో అంతా భోజనం చేసేరా నిన్న" అన్నాను.

"ఓ, ఇంక నాలుగైదు రోజులు ఏం ఫర్వాలేదు ఈలోగా నాకు వుద్యోగం ఏదైనా చూడండి—నిజంగా చూడాలి. వస్తా, స్టోర్స్ తీస్తారు" అంటూ పరుగెత్తుకుని వెళ్ళిపోయేడు.

నలుగురు పిల్లలతో ఆడుకుంటూ చదువుకోవలసిన కుర్రాడికి, యింత చిన్న వయస్సులోనే ఎంత బాధ్యతో, పాపం!

ఆనాడు ఆదివారం. ఆఫీసు లేదు. అలస్యంగా లేచేను. నెమ్మదిగా కాఫి తయారు చేసుకుని తాగి, సిగరెట్టు తాగుదామని చూస్తే. నాలుగు సిగరెట్లే వున్నాయి పెట్టెలో. వెధవజీవితం సిగరెట్లు అయిపోతాయంటే భయం. ఏ పనీ చెయ్య బుద్ధికాదు. రామమరాఢే కనిపిస్తాడేమోనని కిటికీలోంచి చూసేను. ఎక్కడా కన్పించలేదు. ఇంతలో పేపరు కుర్రవాడు వచ్చేడు. వాడి దగ్గర పేపరు తీసుకుని, హెడ్డింగులు చూసి, బల్లపైన చిరాగ్గా పడవేసి, యిస్త్రీ పైజామా, చొక్కా తొడుక్కుని పర్సులోని డబ్బులు లెక్క పెట్టుకుని ఒక రూపాయి పైజామాలో వేసుకుని, సిగరెట్లు కొనుక్కోడానికి స్టోర్స్‌కి బయలుదేరబోతూ, అద్దంలో చూసుకున్నాను. తల అంతా బాగా పెరిగివుంది. తిన్నగా

''సెలూన్''కి బయలుదేరేను.

కొంచెం దూరం వెళ్ళేసరికి బెలూన్‌లు. బూరలూ అమ్ముతూన్న వ్యక్తిచుట్టూ పిల్లలంతా చేరివున్నారు. అందులో రామ మరాఢే ఉన్నాడు. వాడు నన్ను చూడగానే నవ్వు మొహంతో దగ్గరగా వచ్చి, ''పది పేను పైసలు ఉంటే యివ్వండి అంకుల్! బూర కొనుక్కోవాలి'' అన్నాడు చనువుగా.

ఎందుకో నాకే అర్థంకాదు. చటాలున కోపం వచ్చింది. ''బూరాలేదు, గుడ్డూలేదు. అయినా గాడిదలా ఉన్నావు. నీ కింకా బూరలేమిటి!'' అనేసి ముందుకి వెళ్ళిపోయేను. అప్రయత్నంగానే చూసేను. వాడు తల వంచుకొని ఉన్నాడు సిగ్గుతో. వాడి మొహం తెల్లగా పాలిపోయివుంది. నాలుగడుగులు ముందుకి వేసేక, యెందుకు అంత కఠినంగా మాట్లాడేనా అని నొచ్చుకోసాగేను.

సెలూన్‌వద్ద జనం, ఆదివారం అవడం వల్ల కాబోలు, రేషన్ రోజుల్లో బియ్యం దుకాణం ముందు నిలబడ్డ జనాన్ని మించిపోయి వున్నారు, అయిదు నిమిషాలు అక్కడే నిలబడి ఏం చెయ్యాలా అని ఆలోచిస్తూ వుండగా శంకరనాయర్ కన్పించి తను కొన్న మోటార్ సైకిలు చూడటానికి రమ్మన్నాడు. ఇంక యివ్వేళ క్షురకర్మ కుదరదని నిశ్చయించుకుని అతని యింటికి వెళ్ళి, అతనిచ్చిన కాఫీ తాగి, అతని మోటార్ సైకిల్‌ని మెచ్చుకుని. కాస్సేపు పిచ్చాపాటి మాట్లాడుతూ వుండగా, మాటల సందర్భంలో ''మీ దగ్గర ఎధీసివ్ ప్లాస్టర్ వుందా?'' అన్నాడు నాయర్.

''అవును. ఇంట్లో వుండాలి. అర్జంటా?'' అన్నాను.

''ఉంటే యివ్వండి. నేను వస్తా. ఇవ్వేళ బజారులో షాపులు తియ్యరు.

ఇంతలో రామ మరాఢే మిగతా పిల్లలతో ఆడుతూ అ త్రోవనే వెళ్ళడం కన్పించి, వాడిని పిల్చేను. వాడు ఏమీ జరగనట్లు చిర్నవ్వుతో ''ఏమిటి అంకుల్!'' అంటూ వచ్చేడు. వాడికి యింటి తాళంచెవులు యిచ్చి




''నువ్వు చిన్నసాయం చేసిపెట్టు. ఇంట్లో నా గది అలమార రెండో అరలో మనీపర్సు పక్కనే కుడివైపున 'ఎధీసివ్ ప్లాస్టర్' వుంటుంది. అది ఓ జానెడు కత్తిరించి పట్టుకురా. తాళం మళ్ళీ జాగర్తగా వెయ్యి. కత్తెర నా షేవింగ్ బాక్సులో వుంటుంది. త్వరగా రా'' అన్నాను.

''అట్లాగే అంకుల్!'' అంటూ పరుగెత్తేడు రామ మరాఢే.

శంకర నాయర్ మోటార్ సైకిలు బయట పెట్టి ''రండి—రన్నింగ్ చూద్దాం. ఆట్టే దూరం పోవద్దు'' అన్నాడు.

శంకర నాయర్ బండికి కిక్ యిచ్చి, నన్ను పిలియన్ మీద కూర్చోపెట్టుకుని స్టార్టు చేసేడు. కొత్త బండి చాలా ''స్మూత్ రన్నింగ్''. కాలనీలో రెండు సందులు తిరిగి మళ్ళీ శంకర నాయర్ యింటికి వచ్చేసేం పదినిమిషాల్లో. శంకరనాయర్ బండిని యింట్లో పెడుతూవుండగా, ఆనందంగా నవ్వుకుంటూ గంతులు వేస్తూ వస్తూ రామ మరాఢే కన్పించేడు, వాడి చేతిలో పెద్ద బెలూన్ వుంది. వాడి మొహం సంతోషంతో ఎండలో బెలూన్‌లాగ మెరుస్తోంది. నన్ను చూడగానే జేబులోంచి బూర తీసి వూది, మళ్ళీ జేబులో పెట్టేసుకుని, ''యిదిగో ప్లాస్టర్ అంకుల్'' అన్నాడు.

'ప్లాస్టర్''ని శంకర నాయర్‌కి యిచ్చేసి యింటివైపు రామ మరాఢేతో నడిచేను. ''ఎట్లా వుంది అంకుల్ బెలూన్. చాలా బావుంది కదూ'' అన్నాడు.

''చాలా బాగుందిరా రామూ! డబ్బులు ఎక్కడివి?'' అన్నాను కుతూహలంగా.

''ఇందాక మన యింటిదగ్గర ఆడుకుంటూంటే రూపాయి దొరికింది అంకుల్. పావలాతో బెలూన్ బూర కొనుక్కున్నా. ఇంకో పదిపైసలు పెట్టి మన యింటి ఎదురుగా శారద లేదూ అది ఏడుస్తూంటే దానికి బూర కొనిపెట్టే. ఇదిగో మిగతా చిల్లర ' అంటూ చిల్లరడబ్బులు చూపించేడు.

వాడి మొహం చూసేను. వాడి మొహం నిర్మలంగా వుంది పెదాలు చిన్న చిర్నవ్వును పూసుకుని వున్నాయి. వీధి తలుపులు తీసి లోపలికి వెళ్ళేను మనీపర్సు అలమారలో నేను పెట్టిన స్థానంలో లేదు. పర్సు తీసి డబ్బు లెక్క పెట్టుకున్నాను డబ్బయి ఆరు రూపాయల పన్నెండణాలు వున్నాయి. ఎంత డబ్బు వుండాలో నాకే గుర్తులేదు. ఒక్కటి మాత్రం నిజం. పర్సు యథాస్థానంలో లేదు. రామ మరాఢే పర్సుని తప్పకండా తాకి వుండాలి.




కొంచెం కోపంతో "అరే రామూ! ఈ పర్సులోంచి ఎంత తీసేవు. నిజం చెప్పు" అన్నాను.

"లేదు అంకుల్. నేను అసలు నీ పర్సుని తెరవలేదు."

"మరి దీన్ని నేను యీ వైపు చివరగా పెడితే మధ్యలోకి ఎందుకు వచ్చింది" అన్నాను రెచ్చిపోతూన్న కోపాన్ని అదుపులో పెట్టుకోడానికి ప్రయత్నిస్తూ.

"షేవింగ్ బాక్సులోని కత్తెరకోసం వెతుకుతూంటే పర్సు కింద పడిపోయింది అంకుల్. దాన్ని మళ్ళీ తీసి పైన పెట్టేను" అన్నాడు అమాయకంగా నావైపు చూస్తూ.

"వీడిని అసలు చేరదియ్యడమే నా తప్పు. నన్ను వెర్రివెధవ అనుకుంటున్నాడు వీడు. వీడికి ఇప్పుడే బుద్ధి చెప్పాలి" అనుకున్నాను వళ్ళు తెలియని కోపంతో.

"అసలు పర్సు ముట్టుకోలేదని యిందాకా యెందుకు అబద్ధం చెప్పేవు? అయినా నీ కా రూపాయి యెక్కడిదిరా? ఇందులోంచే తీసేవు. అవునా? నిజం చెప్పు. లేకపోతే చంపేస్తా" అని వాడి చొక్కా పట్టుకుని గుంజేను.

"లేదు అంకుల్. నిజంగా నాకు రూపాయి రోడ్డుమీద దొరికింది. నేను పర్సులోంచి తియ్యలేదు" అన్నాడు దీనంగా.

ఆకస్మికంగా నాకు గుర్తొచ్చింది. డెబ్భయి ఏడు రూపాయల చిల్లర నేను వుదయం లెఖ్ఖపెట్టినట్లు. మరి యింకో రూపాయి ఏమయింది. నేనేమీ ఖర్చుపెట్టలేదే ఉదయం నుంచీ. రామ మరాఢే అబద్ధం ఆడుతున్నాడు.

కోపంతో రామ మరాఢేని లాగి వక్కలెంపకాయ కొట్టి, వాడి చేతిలోని బెలూన్‌ని లాక్కొని, నేలను వేసి పగలకొట్టి, "ఛీ! దరిద్రుడా. ఇంక నీ మొహం నాకు చూపించక. నిన్ను చూస్తే పాపంకూడా వస్తుంది. పో—యిక్కడ్నుంచి" అని అరిచేను.

రామ మరాఢే కళ్ళమ్మట నీళ్లు కారుస్తూ, వెక్కివెక్కి ఏడుస్తూ, బయటికి వెళ్ళబోతూ, వక్కక్షణం ఆగి, వెనక్కి తిరిగి చూసి చెప్పలేక, త్వరగా బయటికి వెళ్లిపోయేడు.

వాడు వెళ్ళిపోయిన ఓ అరగంటవరకు కోపంతో కుతకుతలాడిపోతూ, యిట్లాంటి వాళ్లని జేరదీసినందుకు నన్ను నేనే తిట్టుకున్నాను. తర్వాత వంటచేసుకునే ఆసక్తి లేక, బట్టలు మార్చుకుని హోటలుకి వెళ్ళి భోజనం చేసేను.

ఆ సాయంత్రం కాబోల్సు పైజమా వేసుకుని చిల్లరడబ్బులు జేబులో వేసుకుని స్టోర్సుకి బయలుదేరబోయేను....సిగరట్ల స్టాకుకోసం.

చిల్లరడబ్బులన్నీ పది అడుగులు వెయ్యకండానే కాళ్ళముందు, యింటిముందు గచ్చుమీద పడివున్నాయి. పైజమా జేబూలో చెయ్యిపెట్టి చూస్తే, పైజమాకి ఓ మూలగా రెండువేళ్లు పట్టేంత చిన్న కన్నం.

వెంటనే ఆ డబ్బుల్ని ఏరుకుని "యిట్లా ఎన్ని డబ్బులు పోయేయో" అనుకుంటూండగా, ఉదయం పైజమా జేబులో రూపాయి బిళ్ళ వేసుకుని సెలూన్‌కి బయలుదేరడం గుర్తొచ్చింది.

పొరబాట్లు చెయ్యడం ఎంత తేలికో, వాటిని దిద్దుకోవడం అంత అసాధ్యం అని అప్పుడు అర్థం అయ్యింది. రామ మరాఢే ఏమయిపోయేడో గాని నాకు ఎన్నడూ ఆ కాలనీలో, ఎంత వెతికినా మళ్లీ కన్పించలేదు. బహుశా కన్పించడుకూడానేమో— నేను చేసిన అన్యాయానికి, అవమానానికి! ఆ తర్వాత కొన్నాళ్ళకి గోపాల మరాఢే కుటుంబంకూడా ఆ కాలనీనుంచి అదృశ్యమయిపోయింది.